# హింస



సుధాకర్ సుస్తుగ స్కూల్‌వైపు నడుస్తున్నాడు. వెనకాల వెంకట్ సుధాకర్ ఉదాసీనతను గమనిస్తు వున్నాడు. వడివడిగ నడిచి సుధాకర్‌ను కలిశాడు.

"సుధా ఎందుకట్ల విచారంగా వున్నావు"

"ఏం లేదు"

"లేదు ! ఏదో వుంది"

ఏం లేదన్నట్టు చూశాడు.

"రాత్రి నిద్రసరిగపోలేదా. కళ్లు ఎర్రగ వున్నాయి".

వెంకట్ అట్లా అడగగానే సుధాకర్‌కెందుకో ఏడుపొచ్చినట్టు అయ్యింది. ఏదో చెప్పబోయి ఆగిపోయాడు.

"చెప్పుఆగినవు, చెప్పు" అని సుధాకర్ రెక్కపట్టుకొని ఆపి, తాను ఆగిపోయాడు.

సుధాకర్ కళ్లనిండ నీరు తిరిగింది.

"మానాన్న మా అమ్మను"

"ఆఁ అమ్మను"

"రోజు తాగొచ్చి కొడతాడుర"

"రాత్రి కొట్టాడ"

"ఆ" అన్నాడు. అప్పుడు కళ్లలోని నీరు చెంపలమీదికి జారినయి. మౌనంగ వెంకట్ ఆ నీటిని తనచేత్తో తుడిచాడు. అప్పుడు వాళ్ల ఇద్దరి మనస్సులు ఎంతో దగ్గరైనాయి.

"ఆయన తెచ్చే కూలి డబ్బులు తాగుడుకే. ఇంకా అమ్మను డబ్బులివ్వమంటాడు. నేను మధ్యన పోతే, నన్ను తిట్టి నీవు ఏదైన పనికిపోర. నీవు చదివి ఏం సాధిస్తావు" అంటాడు.

అలాగ అన్నట్టు చూశాడు వెంకట్.

"పొద్దంతా పనికిపోయి వచ్చిన అమ్మ పొద్దూకంగ తన్నులు తినడం. నోరు విప్పకుండ పడివుండడం, నాకు చాల బాధేస్తుందిర. భరించలేక పోతున్న"

"తప్పదుర" అంటు సుధా వీపున చేయి వుంచాడు.

"అసలె చాలి చాలని తిండి. చదువు సాగటం లేదు. ఏడవతరగతి బోర్డు పరీక్ష ఎటు తోయటం లేదు." సుధా.

"ఏది ఏమైనా కాని చదువు బాగా చదవాలి. ఓ పనిచేయి నీవు మాయింటికిరా, కలిసి చదువుకుందాం".

సరె అన్నట్టు తలాడించాడు.

ఆరోజునుండి రోజు సాయంత్రం వెంకట్ యింటికి వెళ్లి చదువుకుంటువున్నాడు. ఒకరోజు చాలపొద్దుబోయి వచ్చాడు.

"ఈరోజు ఆలస్యం ఎందుకైంది" అని అడిగాడు వెంకట్.

"ఏంలేదు నాన్న రోజు కొట్టినట్టే ఈ రోజు జుట్టు బట్టి" ఆగాడు.

"కొట్టబోయాడు"

"అయితే"

"అమ్మ జుట్టువొదిలించుకుని, గుడ్లు ఉరిమి నాన్న జుట్టు పట్టుకుని -"

"పట్టుకొని -" అప్పుడెందుకో వెంకట్ ముఖంలో కాంతి కనిపించింది.

"నిలదీసింది. మరొకసారి నామీద చేయివేసావో నా సంగతి చూపిస్త" అని ఈడ్చుకపోయి నీళ్ల గోలెంలో తలను నాలుగుసార్లు పొదిగిన కోడిని ముంచినట్టు ముంచి వదిలింది. అప్పుడు అమ్మను చూస్తుంటే నాకు భయమేసింది.

చుట్టు పక్కల ఇండ్ల వాళ్లు, ఆడవెుగ అమ్మనే మెచ్చుకున్నారు.

"ఎన్నాళ్లని తన్నులు తింటది బాగ చేసింది" అన్నారు.

చేయనైతే చేసింది గాని అమ్మ మళ్లి ఏడుస్తు కూర్చుంది.

"నీవు బాగచదివి, పైకొస్తేనే ఆమె బాధలు తప్పుతాయి." అన్నాడు వెంకట్.

"ఎట్లనో అట్ల ఓపికపట్టు. ఈ ఏడవతరగతి పూర్తికాగానే చెప్పచెయ్యకుండ వెళ్లి హాస్టల్లో చేరిపోదాం. ఆ తరువాత ఎంతైనా చదవొచ్చు."

"అదె చెయ్యాలె"

"చేద్దాం, నేను గూడవస్తకదా" అంటూ బడివైపు నడిచారు.

తల్లి, తండ్రి కంటె ఎక్కువ పనిచేస్తుంది. ఇంటిల్లి పాదికి చాకిరిచేస్తుంది. సంతానాన్ని పెంచి పెద్దచేస్తుంది. మామూలుగ బతకడానికి సంపాదించే తండ్రి తల్లిమీద, యింత సాగించడం ఎందుకో ఏ ఇంట్లో నైనా ఆ ఇంటి వ్యక్తి తన భార్యమీద ఏదోరకంగా సాధిస్తునే వుంటాడు. దానికి ఒకటె మందు. ఆమె సంతానం పెరిగి పెద్దవాళ్లయి విద్యాబుద్ధులు నేర్చుకుని, సంపాదించి అష్టకష్టాలపాలైన తల్లిని సుఖపెట్టటమే. అది తప్ప వాళ్లకు మోక్షం లేదు అనుకుంటు బడిగేట్లోకి అడుగు పెట్టారు. అప్పుడే ప్రార్థన గంట అయింది. వెళ్లి వరుసలో నిలుచున్నారు. అతని మనస్సు ప్రేయర్ మీద లేదు. 'భార్య-భర్తలు ఇద్దరు మనుషులే. ఇద్దరు సమానులే. మరి భార్య మీద భర్త పెత్తనం ఏమిటి ? ఎందుకు" అనుకున్నాడు.

●